క థా ని క

# కౌసల్య

'శార్వాణి'

"హృదయ పరివర్తనలేనపుడు, మాటల్లో మంచితనం మరో విధముగా మారుతుందనుకుంటాను. నిజమేనా పిన్నీ!" మంచం మధ్య, మోకాళ్లుచుట్టూ చేతులుచుట్టి కూర్చున్న కౌసల్య తలపైకెత్తి, సుమిత్ర నడిగింది.

"మాటలతో జయించాలని చూచేవాళ్లు ఎదుటి హృదయాన్ని సరిగా అర్థంచేసుకోలేరు. అటువంటప్పుడు, నీవు నిర్ణయించుకున్న మంచితనం మరో విధంగా ఎవరి విషయంలో మారిందీ చెప్పకూడదూ!" సుమిత్ర సమాధానం ఎదుటికాళ్లకు బంధాలువేసినట్లు ఫీలయింది కౌసల్య.

"సహృదయులయితే ఎదుటివాళ్ళను అర్థంచేసుకోవడం నేర్చుకుంటారు." మంచంమీదనుంచిలేచి, సుమిత్ర కూర్చున్న సోఫాలో ప్రక్కగావచ్చి చతికిలబడింది.

"నీ మనసులో భావానికి సహృదయంఉంది భక్తి శ్రద్ధలు లేకపోవుటవల్ల, ఆ భావానికి గౌరవం దక్కడంలేదు."

సుమిత్ర, తన మనసులో విషయాన్ని తేలిగ్గా బయటకులాగి, అర్థంచేసుకొని, డొంక తిరుడుగా సమాధానం చెబుతుందని కౌసల్య అనుకుంది. తను మాత్రం బైటకు తొణకలేదు. నిండుకుండలాగ ప్రవర్తించింది.

"రాయికి ప్రాణంలేనపుడు, భక్తి ఎట్లా సంభవిస్తుంది?"

"రాయికి ప్రాణంలేకపోయిన, ప్రతిరాయి రప్పకు వంగి వంగి ఎందుకు నమస్కారాలు చేస్తున్నాం? ఆ రాయిమీద ఉన్నభక్తివల్లకాదు. ఒకప్పుడు సజీవంగాఉన్న ఆ రాయిలోని మంచితనానికి, ఇప్పుడు మనమంతా భక్తులమయ్యాము. ఇవన్నీ నన్నడిగి తెలుసుకొనేబదులు, ఇంట్లో మాష్టార్ని అడిగి తెలుసుకోవచ్చుగా?"

పరోక్షంగా ఎవర్ని గురించి ఉద్దేశించి, నిర్దిష్టంగా విమర్శించాలని అడుగుతుందో ఆమె నిర్మించుకున్న నిర్ణీత పరిధిల్లో సుమిత్ర యిరుక్కొనలేదు. కౌసల్య మాటల్లో అంతర్యాన్ని, ఇట్టే పసికట్టింది. ఆడదాని హృదయం ఆడదే తేలిగ్గా తెలుసుకోగల్గుతుందుగాని, మగవాడేకాదు — సృష్టించిన విధాతకూడ తెలుసుకోలేడు.

అతి శ్రద్ధగా వింటున్న సుమిత్ర మాటలు కౌసల్యకు యిష్టాన్ని కల్గించలేకపోయాయి. అనుకూలంగా సమాధానం వస్తుందని ఆశించిన ఆమెకు ప్రతికూల వాతావరణం మిగిలింది.

"పిచ్చిపిల్ల! మంచికి గౌరవం ఇచ్చినపుడు మన జీవితాలు సుఖంగా జరిగిపోతాయి. ఎవరైతే అపార్థంచేసుకొని, దూరంగా మసలుతున్నావో, వారి హృదయాన్ని అవగాహనం చేసుకొని దగ్గరగా కలవడానికి ప్రయత్నంచేయి."

"తప్పుచేసినట్లు తప్పించుకొని తిరుగుతే, ఎవరది తప్పంటావు?"

"అనుకున్నవాళ్ళది."

కౌసల్య ఉలిక్కిపడింది. కోపంవచ్చింది. సుమిత్ర నవ్వుతోంది.

"అయితే తప్పంతా నాదేనంటావు." తనకు తానే స్వయంగా పట్టుబడిపోయింది.



2

"దొరికిపోయావు. అనవసరంగా ఇతరులను నిందిస్తే, నిజం ఎప్పుడూ అబద్ధంకాదు. డబ్బుతో విషయాన్ని కొనుక్కోనవు; అమాయకులు నిందుతులు కావచ్చును. ఆ పనిమాత్రం తలపెట్టవద్దు." కౌసల్య రెండు భుజాలుపట్టుకొని ఊపుతూ, వివర్ణమైన ముఖం లోనికిచూచింది సుమిత్ర.

"ఎవరండి దొరికిపోయింది ?"

గుమ్మానికి రెండువైపులా చేతులుఆన్చి, అచ్చటకువచ్చి నిలబడ్డాడు వెంకట్రావు.

కౌసల్య అచ్చటనుంచి మెల్లగా జారిపోయింది.

"వెళ్ళిపోతున్నావేం ?" పిన్ని పిలుస్తున్నా, విన్పించుకోనట్లు, జవాబివ్వకుండా వెడలిపోయింది కౌసల్య.

"ఎప్పుడువచ్చారు? వచ్చేముందు ఉత్తరమయినా వ్రాయలేదు!" వెంకట్రావు లోపలికి ప్రవేశించాడు.

"మధ్యాహ్నంవచ్చాను. మీరప్పుడే కాలేజికి వెళ్ళారని చెప్పారు."

"మామయ్యగారు రాలేదనుకుంటాను."

"అక్కయ్యకు అస్వస్థతగాఉంటే, అనుకోకుండా రావలసివచ్చింది. మొన్నేగా ఇచ్చటకువచ్చి వెళ్ళింది. చదువు బాగా సాగుతుందా ?"

"ఇబ్బందులుకల్గినపుడు, అన్నీ సక్రమంగానే జరిగిపోతవి. మామయ్య మంచితనం నన్ను తిరిగి మనిషిగా చేసింది. నిరాధారుడ్నయిన నాకు నీడ చూపించారు. నిర్విచారంగా గడచిపోతుంది జీవితం."

"అదృష్టవంతుడివి. మంచి ఎప్పుడూ మంచినే వెతుక్కుంటుంది. మంచిగాఉండి మంచిపేరు సంపాదించగలవని ఆశ ఈ ఇంట్లో అందరికిఉంది."

"అందర్ని మెప్పించడం మీరనుకున్నంత తేలిక కాదు."

"అయితే ఎవరో ఒకరు నీ మార్గంలో అడ్డుగా నిలబడి ఉండాలి. కష్టపెట్టుకుంటున్నావా బాబూ!"

"నా కష్టంతో నాకు బాధలేదు. నావల్ల మరొకరికికష్టంకల్గినపుడు బాధపడాలి."

"ఎంత మెత్తని హృదయం! నిన్ను బాధపెట్టేది నీ మంచితనం ఎప్పుడూ కాదు. కోపంగా సమాధానం వచ్చినపుడు, మనంకూడా కోపంగా ప్రవర్తించకూడదు. సహనం, సౌజన్యం, సరళభావం అవసరం. మనంకూడా కోపంపెంచుకొని చిర్రుబుర్రుమంటే మానవత్వానికి దూరంకావలసి ఉంటుంది."

"సహనం, ఓర్పు, క్షమ ... ఇవన్నీ నన్నింతకాలంవరకూ బ్రతకనిచ్చాయి. ఆ వెలుగులోనే నా జీవితం వికాసవంతం అవుతుందికాని ..."

"తర్వాత సంగతి అర్థమయింది."

"మీరైనా ఆ మాత్రం అనుగ్రహించి మాట్లాడుతున్నారు; వినదలచుకోలేదని కసరకుండా దయ చూపుతున్నారు."

"హృదయమిచ్చి మాట్లాడితే, ఎదుటివారుకూడా హృదయమిచ్చి మాట్లాడుతారు. ఒకవేళ మాట్లాడకపోయినా కనీసం రెండోసారి ప్రయత్నమయినా చేస్తారు."

"ఆ ప్రయత్నం ఎన్నిసార్లయినా జరగకపోతే."

"వాళ్లను నిందించి ప్రయోజనంలేదు. నాకొడుకు దుర్మార్గుడని, కన్న కడుపును కత్తితోపొడచి చంపుతానా ? నా అనుబంధం అవివేకికావచ్చు. అంత మాత్రంతో నా నోటినుంచి ఆ సంబంధాన్ని చులకన చేయలేను. అటువంటివాళ్ల మనస్తత్వాలను మార్చాలి, మంచిని గ్రహించేటట్లు చేయాలి."

"ఎత్తునుంచి చూచేవాళ్లకు పల్లం, పల్లంగానే కన్పిస్తుంది. అటువంటప్పుడు మీరనుకున్నది జరగడం కష్టం."

"మనం ఉన్నది ఎత్తని భ్రమపడుతున్నాం. గట్టిగా గాలివీస్తే, ఎత్తున్నున్న వాళ్లంతా పల్లానికి రావలసిందే !

"వాదనకు విరామం అంటూ ఉండదు. అసలు విషయం మరచిపోయాను. అత్తమ్మగారు మిమ్మల్ని పిలవమని చెప్పారు."

వెంకట్రావు అతని గదిలోనికి వెళ్ళిపోయారు. సుమిత్ర క్రిందకు దిగిపోయింది.

"రాజమండ్రి రేపు వెళ్లక తప్పదంటున్నారు. అచ్చట పదిరోజులయినా ఉండవలసి ఉంటుందేమో! నీవువస్తే, కొంచెం ధైర్యంగా ఉంటుంది" సుందరమ్మ చెల్లెల్నిచూచి అంది.

"సరే! వారికొక కార్డువ్రాస్తే మంచిది"

"కార్డు వ్రాయకపోతే, వాళ్ల బావయ్య మరదల్ని మాయంచేశాడని మా తమ్ముడు అనుకోడులే!" సుమిత్ర మాటకు అడ్డుగా నిలబడి, గుమ్మంలో కాలు పెడుతూ అన్నాడు కౌసల్య తండ్రి వీరభద్రయ్య.

"చూడవే! బావకు వసంతాలునిండినా పరిహాసం పోలేదు."

"నాన్న! పిన్ని మిమ్మల్ని ఏమంటుందో విన్నారా?" కౌసల్య హసించింది.

"అవునమ్మ! ఈ రోజుల్లో బావలు మరదళ్ళకు లోకువ!" మూతిమీదపడుతున్న కోరమీసాలను ప్రక్కకుతోస్తూ, చిన్నగా నవ్వాడు.

"మీ వేళాకోళాలకేంగాని, రేపు ప్రయాణానికి మంచిదని ఆచార్యులుగారు చెప్పారు."

"అయితే తాళాలు ఎవరిచేతికీయాలి?"

"అమ్మాయి ఉందిగా?"

"ఇంట్లో మగదిక్కు ఉండగా, వాడికెందుకీయ కూడదు?"

"మీ కిచ్చినట్లే ఉంటుంది."

"ఇంటి పెత్తనం అమ్మాయిమీద పడిందన్న మాట!" మేడమీదనుంచి క్రిందకువస్తున్న వెంకట్రావునుచూచి,

"ఒరేయి బాబూ! తాళాలు అమ్మాయిచేతిలోనికి వెళ్ళిపోయాయి. అవసరమొస్తే డబ్బు అడిగి తీసుకుంటూఉండు. అసలే భయస్తుడివి." భద్రయ్య పణిగాడు.

"ఆ విషయంలో బాబు ముందే జాగ్రత్తపడి ఉంటాడు." సుమిత్ర అంటుంటే సుందరమ్మ మరియొకవైపుకి ముఖంత్రిప్పి, మౌనంగా కూర్చుంది. కౌసల్య విసుగ్గా అచ్చటనుంచి వంటిట్లోనికి వెళ్ళిపోయింది.

♦ ♦ ♦

వీరభద్రయ్య భార్యను రాజమండ్రి తీసుకొని వెళ్ళి, రెండురోజులయింది. సురక్షితముగా చేరుకున్నట్లు, సుందరమ్మ కులాసాగా వున్నట్లు ఉత్తరం వచ్చింది.

భోజనంచేసి మేడమీదకు వచ్చిన వెంకట్రావుకి, నిద్రపోతున్న శారద కన్పించింది.

"మొద్దునిద్ర. పరీక్షలు దగ్గరకు వస్తున్నాయి. కాస్సేపు చదువుకోకూడదూ!" అచ్చటకు వచ్చిన కౌసల్యను చూడకుండా కౌసల్య చెల్లెలిని లేపబోయాడు.

"ఇవ్వాళ చదువుకోవద్దని నేనే చెప్పాను. దాన్ని లేపడం అనవసరం." కౌసల్య కటువుగా అంది.

"బాగుపడుతుందనే ఉద్దేశ్యంతో లేపబోయాను. వద్దని నివారించిన తర్వాత విరమించుకుంటున్నాను."

అచ్చటనుంచికదలి, మెల్లగా తన గదిలోనికి వెళ్ళిపోయాడు. శారదను లేపడంలో తన తప్పేముందని? తప్పులేకపోయిన తను చేస్తున్న ప్రతి పనికి అడ్డుగా నిలబడి ఆటంకపరచడమంటే ఆమె కిష్టం. ఎదురు సమాధానం చెబితే వూరికినే ఉడికిలిపోతుంది. తొక్క త్రొక్కిన త్రాచుపాములాగ బుసలు కొడుతుంది. అటువంటి ప్రతికూల వాతావరణంలో యిమడటం ఎవరికైనా కష్టంగానే ఉంటుంది.

"బావా లెక్కరావటంలేదు. కాస్త చెప్పవూ!"

పలక బలపం పట్టుకొనివచ్చిన శారద, అతని ఆలోచనలన్ని చెల్లా చెదర చేసింది.

“ఎవరైతే పంపించారో, వాళ్ళనే చెప్పమని అడగకపోయావూ!”

ఎవరికైతే ఆ మాటలు వినిపించాలో, వాళ్ళకు వినిపించేలాగ అన్నాడు.

“తెలియకపోతే తెలియదని చెప్పక, తప్పించుకోవడం దేనికి” అతన్ని అవమానపరచాలని, కౌసల్య గట్టిగా గదిలోనుంచి అరిచింది.

“ఎవరు తెలియక పంపించింది తెలుస్తుందిగా! శారదా! ఇక్కడకు నిన్ను పంపించిందెవరు?”

“ఎవరూ పంపించలేదు. లెక్క తెలియకపోతే నేనే వచ్చాను.”

“నిద్రపోతున్న నీవు, నీకు నీవే ఎవరుపంపకుండా వచ్చావుకదూ! నమ్మవచ్చునా?”

“అంత అపనమ్మకంగావుంటే, మాట్లాడకుండా వూరుకోవటం మంచిది శారదా! వచ్చేయిక ఎందుకక్కడ నిలబడ్డావు?”

శారద కోపంలో రెచ్చిపోతున్న కౌసల్యవంక చూచింది.

“పెద్దవాళ్ల మనస్తత్వాలబట్టి చిన్న పిల్లల మనస్తత్వాలు మారుతాయి - నిజాలు నేర్పడానికి బదులు, జయించాలనే అభిలాషతో చిన్న పిల్లల మనస్సులను మంచి నుంచి దూరంచేయడం తెలివితక్కువతనం; ఇది గ్రహించడంవల్ల ఉపయోగం ఉంటుంది.”

“పాఠాలు నేర్చుకోటానికి నేనేమి పసిపిల్లను కాదు.”

“పాఠాలు చిన్నపిల్లలేకాదు నేర్చుకొనవలసింది; కొన్ని సమయాల్లో పెద్దవాళ్లుకూడా నేర్చుకొనవలసి ఉంటుంది. ఈ విషయమైన అర్థంచేసుకోవడం ధర్మమేమో!”

వాళ్లిద్దర మధ్య జరుగుతున్న సంభాషణను శ్రద్ధగా వింటున్న శారదను దగ్గరగా కూర్చోపెట్టుకొని, లెక్కలన్నీ అర్థమయ్యేటట్లు సులువుగా చెప్పి పంపించాడు.

శారద వెళ్ళిపోయింది.

కౌసల్య కిక్కురమనకుండా వూరుకుంది.

వెంకట్రావు శూన్యంలో తలదూర్చి, ఆలోచిస్తున్నాడు. ఎదురుగుండా దీపం దేదీప్యమానంగా వెలుగుతోంది. కాని అతని కళ్లముందు నల్లని తెరలు ముంచుకుపడుతున్నాయి. భరించరాని ఏకాంతం. భయకంపితమైన అఖాతం, అర్థమవ్వని అంధకారం.

“అమ్మ నన్నెందుకిచ్చట వదలిపెట్టి వెళ్ళిపోయింది?” హృదంతరంలో ప్రశ్న.

“చావలేక బ్రతకడంకోసం.” నిట్టూర్పు నెత్తాని దొంతరలను అందిస్తుంది మామయ్య ఇనుపపెట్టితాళం.

“పట్టు తప్పింది. మరొక ఆధారం చిక్కింది. కష్టమో, నిష్ఠూరమో దక్కిన కొమ్మను విడిచిపెట్టకు.” ఆకలిజీవితంమీద దర్జాగా కూర్చుని కబుర్లుచెబుతోంది.

గతించిన నాల్గు సంవత్సరాల చరిత్ర తల క్రిందులుగా అతని ముందు కదిలిపోయింది. తండ్రి మరణాంతం, పెళ్లీడుకు వచ్చిన యిద్దరు కూతుళ్లు, చదువుకుంటున్న కొడుకు దిక్కులేని పక్షులయ్యారు. సంతాన సంరక్షణకోసం తల్లి హృదయం తల్లడిల్లి పోయింది. బ్రతకడం కోసం మార్గాన్ని వెదుక్కుంటున్న తల్లి హృదయం ఆనాడు ఎంత క్షోభించిందో, వెంకట్రావు కళ్లలో కదులుతున్న కన్నీరు చెబుతోంది. పుట్టింటి వాళ్ళిచ్చిన రెండెకరాలు విక్రయించి, ఇద్దరి పిల్లల వివాహాలు వరకట్నాలిచ్చి జరిపించింది. కుమారుడు, తనూ మిగిలారు. కుమారుని భవిష్యత్తు జీవితం గురించి బాధపడుతున్నప్పుడు, వీరభద్రయ్య దేవుడులాగ కన్పించాడు.

“ఒక్కడేగా! మా ఇంట్లో ఉంటూ, చదువుకుంటాడు.” వీరభద్రయ్య తల్లి దగ్గరన్న మాటలు జ్ఞాపకానికి వచ్చాయి.

"స్కూలు ఫైనలువరకు చదివితే ఏదో ఉద్యోగం దొరికితే వాడి దారి వాడు చూసుకుంటాడు."

కుమారుడ్ని వీరభద్రయ్యకు అప్పగించింది. "బాబూ! మీ మామయ్య ఎంత దగ్గరవారయినా మనం దూరపు వాళ్ళమే! డబ్బున్న వాళ్ల మనస్సులో మనం దూరంగా వుంచబడతాం. కలవారింట్లో కొత్తలో కొంచెం బాధగానే ఉంటుంది. జాగ్రత్తగా వాళ్ళకు అనుకూలంగా మసులుకుంటే అంతా అలవాటు అవుతుంది. వారికికష్టమొచ్చేపనులు తలపెట్టకూడదు. మంచిగా ఉండి, మంచిపేరు సంపాదించు" తల్లి, కుమారుడ్ని హృదయానికి హత్తుకొని, కన్నీరు పెట్టుకుంది. ఆ కన్నీరు అతని కళ్ళలో కదిలిపోతోంది.

వెంకట్రావుకి దుఃఖం ఆగలేదు.

"అమ్మ!" అంటూ వెక్కి వెక్కి చంటిపిల్లవాడిలాగ విలపించాడు.

ఆ విశాల సౌధంలో...... ఆ కన్నీరు ఎవరికి కన్పించదు. ఆ వివాదం ఎవరికీ కన్పించదు.

మామయ్య మంచివాడే!

ఏం లాభం?

ఆ మంచి అంతా అత్తయ్య హృదయంలో తారుమారవుతోంది. మరొక రూపం ధరిస్తుంది, ఆ రూపం అతన్ని కష్టపెడుతుంటే, బాధపడటమంటే నేర్పుతుంది. అదే కౌసల్యకు కావాలి.

తల్లీ కూతుళ్లు నవ్వుతున్నారు.

మామయ్యకు అర్థం కాలేదు.

ఆ నవ్వులోసానుభూతి లేదు.

అనునయం అంతరించింది. అహం అధికమైపోయింది.

అంతా చీకటి

అనుకున్నదంతా కటిక చీకటి.

తెల్ల తెల్లగా తెల్లవారింది. మెల్ల మెల్లగా కళ్లు తెరచిన వెంకట్రావుకి ఎదురుగుండా కౌసల్య ప్రత్యక్షమయింది. అతఁడు త్రుళ్ళిపడ్డాడు. కల కాదని, వాస్తవికతని నిర్ణయించడానికి కొన్ని నిముషాలు పట్టింది. కన్నీటి మరకలుపడ్డ ముఖంతో, ఎఱ్ఱ చారలు పడ్డ నేత్రాలతో, అతనికి తెలియకుండా తొంగి చూస్తున్న కౌసల్య అధరాలు అదిరాయి. వెంకట్రావు తల ఎత్తి ఆమె వైపుకి చూచేసరికి, ఆమె అచ్చట నుంచి తప్పించుకొని వెళ్ళిపోయింది. ఆమె కన్పించే వరకు చూచి, ఆమె తత్వాన్ని అర్థం చేసుకోలేక సతమత మవుతూ, మొహం కడుక్కొని కాఫీ త్రాగటానికి పడమటి గదిలోనికి వచ్చి కూర్చున్నాడు. ఎవరూరాలేదు. చాల సేపటివరకు చూశాడు. ఎవరూ కన్పించలేదు. విసుగెత్తి వెళ్ళిపోదామనే ప్రయత్నంలో శారద కన్పించింది. ఆమె చేతుల్లో ఏమి లేవు. వెంకట్రావుకేమి అర్థం కావడంలేదు. తనకుతాను స్వయంగా వెళ్ళి, 'భిక్షాందేహి' అని అడిగే గతి పట్టిందనుకున్నాడు. ఆ సమయంలో సంఘటితమైన ఆ పరిస్థితికి అతనిమీద అతనికే జాలివేసింది. ఆకలి దహించుకుపోతుంది. చర చరా మేడమీదకు వెళ్ళిపోయాడు. టేబిలుమీద టిఫిను, కాఫీ పెట్టి ఉన్నాయి. కొంచెంసేపు నిశ్చేష్టుడై, నిమ్మదిగా ఫలహారాన్ని పూర్తి చేశాడు.

బట్టలు వేసుకొని, సావిడి గుమ్మందాటి బయటకు వస్తుండగా, లోపలినుంచి అతన్ని పిలుస్తున్న శబ్దం విన్పించింది. వెనక్కి తిరిగాడు.

"ఆలస్యంగా వస్తే..." వంట మనిషి నరసమ్మ మాట విన్పించింది.

"వడ్డన చేసేవాళ్లు ఎవరూ ఉండరనా! ఫర్వాలేదు. మీ అమ్మగారు కష్టమని అనుకోకాపని, నేను చేయడానికి నాకు తేలిగ్గా ఉంటుందని, అందుకు నేనేమి బాధపడనని మీ అమ్మగారితో చెప్పు."

వెంకట్రావు వెళ్ళిపోయాడు.

ఇవన్నీ వింటున్న కౌసల్యకు వళ్ళు మండిపోయింది.

"ఎంత నిర్లక్ష్యం!" పళ్ళు పట పట కొరుకుతూ జరగబోయేదాని గురించి ఆలోచిస్తోంది.

♦ ♦ ♦

వెంకట్రావు తిరిగి ఇంటికి వచ్చేసరికి, వీధి గుమ్మం తలుపులు వేసివున్నాయి. అప్పటికి చాల చీకటి పడి పోయింది. వీధిలో జనసంచారంలేదు. అక్కడక్కడ కుక్కలు తిరుగుతూ, మొరుగుతున్నాయి.

రెండు మూడు సార్లు వీధి తలుపులు తట్టాడు. ఎవరూ తీయలేదు. ఈ సారి ఉండ బట్టలేక గట్టిగా బాదాడు. కొంచెం సేపటికి నరసమ్మ తలుపుతీసి వెళ్లి పోయింది. తిరిగి తలుపులువేసి, మేడ మీదకు వెళ్ళి, మడత మంచం వాల్చుకొని నడుం వాల్చాడు.

"చిన్నమ్మగారు రేపు రాజమండ్రి వెళ్తారట." నరసమ్మ చెప్పతూ వచ్చి, కొంచెం దూరంలో నిలబడింది. తన భోజనం సంగతి అడుగుతుందేమో అనుకున్నాడు. అటువంటిదేమి జరగలేదు. తను అన్నం తినిసా, తినక పోయినా ఆ యింట్లో ఎవరూ పట్టించుకున్నట్లులేదు. చివరకు పని మనిషికికూడా అవసరం లేకుండా పోయింది. పాపం పనిమనిషేమి చేస్తుంది? దానికి డబ్బిస్తే, అది చెప్పినట్లు వింటుంది. అమ్మగారి చేతిలో కీలుబొమ్మ.

"అని మీ అమ్మగారు చెప్పమన్నారా?"...... వెంకట్రావు నవ్వుతూ నసిగాడు.

నరసమ్మ దగ్గరనుంచి సమాధానం లేదు.

"ఇంత అకస్మాత్తుగా ప్రయాణమయ్యారు. అంత అవసరమేమొచ్చింది చెప్పలేదా?"

"అదేమి నాకు తెలీదండి. వారు ఊరుకెళ్తానన్నారు. అంత వరకే తెలుసు," అచ్చట నుంచి కదిలిన నరసమ్మను పిలిచి,

"బహుశా మీ అమ్మగారు వెళ్ళకముందే నేనే వెళ్లిపోవచ్చును. వారు వెళ్ళినా తిరిగివస్తారు. నా విషయంలో అటువంటిది జరగదు. ఈ సంగతి మీ అమ్మగారితో చెప్పు. చాల సంతోషిస్తారు" వెంకట్రావు అన్నాడు.

నరసమ్మ నిష్క్రమించింది.

శారద కళ్ళు నలుపుకుంటూవచ్చి, మంచంమీద కూర్చుంది.

"ఇచ్చట కెందుకు వచ్చావు. గదిలో భయమేస్తుందా?" ... భయమనే శబ్దం వత్తి పలికాడు.

"మధ్యాహ్నం ఇంటికి ఎందుకురాలేదు? అన్నం ఎక్కడ తిన్నావు?" వెంకట్రావు ముఖం మీదకు వంగి, గుచ్చి గుచ్చి ప్రశ్నలు వర్షం కురిపించింది.

"ఆకలి వేయలేదు. అందుకురాలేదు" నవ్వుతూ సమాధాన మిచ్చాడు.

"అంతా వట్టిది. కోపంవచ్చింది కదూ!"

"కోపం వస్తే కడుపు నిండుతుందా?"

"నిజం చెప్పు బావా! నీవు మధ్యాహ్నం అన్నం తిన్నావా?"

"తినకపోతే ఏం చేస్తావు?"

"అక్కయ్యతో చెప్తాను."

"చెప్పి"

"అన్నం వడ్డిస్తాను."

"వీపుమీద వడ్డించవుగదా!"

"అన్నం తినకపోతే ఆ పనికూడా చేయవలసి ఉంటుంది."

"ఆకలి వేయకపోతే..."

"అక్కయ్య వడ్డిస్తే అదే వేస్తుంది."

"సరేగాని, రేపు మీ అక్కయ్యతోబాటు నీవు కూడ రాజమండ్రి వెళ్తున్నావా?"

"ఊహుం... నేను వెళ్ళను."

"మరి ఇంట్లో ఎవరూ ఉండరుగా!"

"మా బావ ఉంటాడు."

"మీ బావకూడ వెళ్ళిపోతే..."

"మా బావతో వెళ్తాను."

"మీ అక్కయ్యతో వెళ్లకపోతే, నిన్నేం చేస్తుందో తెలుసా? పేకావారి అబ్బాయికిచ్చి పెళ్లి చేస్తుంది."

"ఇద్దరు మాటలు వింటున్న కౌసల్య లేచి, అప్రయత్నంగా అచ్చటకువచ్చి నిలబడేసరికి, ఇద్దరూ గప్‌చిప్‌గా ఉండి పోయారు.

"ఇంత అర్ధరాత్రి వస్తే, ఇంట్లో ఎవరూ కనిపెట్టికొని ఉండలేరు."

వెంకట్రావు కౌసల్య మాటలు వింటూ, లేచి కూర్చున్నాడు.

"కనిపెట్టుకొని ఉండమనన్నప్పుడు, అనవసరంగా బాధపడటం దేనికి?"

నమ్రతతో నీళ్ళు నమిలాడు.

"మధ్యాహ్నం ఇంటికి రానపుడు రావడం లేదని ముందే కబురుచేయకూడదూ!"

"పొరపాటు జరిగిపోయిందని ఒప్పుకుంటున్నానుగా! దూరదేశం నుంచి స్నేహితుడొకడు వచ్చాడు. అతనితోబాటు అనుకోకుండా నాళ్ల ఊరు వెళ్ళవలసి వచ్చింది. ఇంటికివచ్చి చెప్పడానికి టైము లేకపోటంవల్ల రాలేక పోయాను."

ఎంతో ఓర్పుతో చెపుతున్న వెంకట్రావు మాటలు ఆమెను అచ్చటనుంచి కదిలించి వేశాయి. హృదయాన్ని కరిగించి వేశాయి.

"బావా! అక్కయ్య అన్నం తినలేదు. నిద్రపోలేదు. నీకోసం ఎదురు చూస్తూంది." కౌసల్యకు విన్పించకుండా వెంకట్రావు చెవులో చెప్పింది.

అతని హృదయం స్పందించింది.

అనూహ్యమైన అనుబంధం అవతరించింది.

గబగబా కౌసల్య ఉన్న గదిలోనికి వెళ్ళాడు. కూర్చున్న కౌసల్య, అతన్ని చూచి, లేచి నిలబడింది.

"మిమ్మల్ని చాల శ్రమ పెడుతున్నాను. ఇంత ఆలస్యంగా అన్నం తింటే ఆరోగ్యం పాడవుతుంది. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేస్తే, పెద్దవాళ్లమయిన తర్వాత బాధ పడాలి."

"నా గురించి మీ రెవురు బాధపడనవసరంలేదు. నేను భోజనం చేశాను. పనులపడవలసిన అవసరం నాకు లేదు." చాల తేలిగ్గా పౌరషం కోసం, అబద్ధమాడినందుకు వెంకట్రావుకి నవ్వొచ్చింది. బయటకు నవ్వితే మరీ ఉడికిలి పోతుందని, నవ్వును ఆమెకు కన్పించకుండా చేశాడు.

"స్వత సిద్ధంగా మీకో మంచి స్వభావం ఉందని, మీకోపం ఇతిమిద్ధంగా చెపుతోంది."

వెళ్లిపోతున్న అతని శూన్యం వైపు ఆశగా చూస్తూ తలుపులు వేసుకుంది.

♦ ♦ ♦

సెకనులు... నిమిషాలు... గంటలు... రోజులు కాలం కళ్ళలో వికాసంగా వినోదంగా కదిలిపోతుంటే లోకం కళ్లలో విషాదంగా విలాసంగా నడిచి పోతున్నాయి.

వీరభద్రయ్య దగ్గరనుంచి రెండవ వుత్తరం వచ్చింది.

చిరంజీవి వెంకట్రావుకి దీవనలు...

మనం అనుకున్నట్లు ఏదీ జరగదు. మీ అక్కయ్యకు తగ్గిపోతుందని ఆశపడి, రాజమండ్రి తీసుకొని వచ్చాము. తగ్గుముఖంలేదు. నీరసంగా ఉంటుంది. శరీరంలో రక్తంలేదు. లేవలేని పరిస్థితిలో ఉంది. కొంతకాలంవరకూ హాస్పటల్‌లో ఉంచడం మంచిదని డాక్టరు చెప్పారు. అంచేత ఇంటికి తీసుకొని రావడం లేదు. మీరెవరూ అధైర్య పడకండి. అమ్మాయికి ఉత్తరం చూపించవద్దు. వాళ్ళమ్మకు కాస్త నుస్తీ చేస్తే చాలు, వూరికే బాధపడుతుంది. ఉత్తరం వచ్చిందని అడిగితే కులాసాగా ఉందని చెప్పు.

రెండు మూడు రోజుల్లో తీరిక చేసుకొని ఒకసారి

అచ్చటకు వచ్చి, విషయాలన్నీ వివరంగా చెబుతాను.

ఇట్లు
వీరభద్రయ్య

వెంకట్రావు జాబు వ్రాసి, బయటకు వెళ్ళిపోతుంటే, రామారావు, అతని భార్య ఆండాళ్ ఎదురయ్యారు. నివ్వెరబోయి, తెల్ల ముఖంపెట్టి చూస్తున్న వెంకట్రావుని, రామారావు కౌగిలించుకున్నాడు.

"భలేవాడివిరా! వచ్చే ముందు ఉత్తరం వ్రాయకూడదూ!" ఇంకా ఆశ్చర్యపడుతూ రామారావు కళ్లలోనికి చూశాడు.

"ఉత్తరం వ్రాస్తే, ఇంత సస్పెన్స్ ఉండదు. సడనుగా వస్తే నీ వెంత సంతోషిస్తున్నావో చూశావామరి."

"మా చెల్లెమ్మ ఇంత చిక్కిపోయింది. ఏం అమ్మా! మావాడు పూర్తిగా ఆఫీసు గొడవల్లో నిన్ను మరచి పోతున్నాడా?"

"గుమస్తా గాళ్ళం - గుమాస్తాల భార్యలు అంత కంటె లావవుతే, ఆఫీసర్ల భార్యలు గొల్లున గోల పెట్టరూ! సరేగాని... ఈ ఇంట్లో నీవుతప్ప, 'నా' అనే వారెవరూ లేరా?"

"అత్తమ్మకు జబ్బుచేస్తే రాజమండ్రి తీసుకొని వెళ్ళారు."

"మాకు సెలవు ఇప్పిస్తావా, బండికి వేళయింది."

"గుమ్మంలో కాలు పెట్టేవో లేదో అప్పుడే వెళ్లిపోతానంటావేం!"

"నీ ఇల్లయితే ఒకరోజుకాదు, ఎన్ని రోజులైనా తిష్టవేసి కూర్చుంటాము. పైగా ఈ ఇంట్లో నీవు తప్ప ఎవరూ లేరంటున్నావాయె!"

"ఈ ఇల్లు వారిదిగా ఎందుకు భావించ కూడదు. మీరీ రోజు వెళ్ళడానికి వీల్లేదు." అప్రయత్నంగా అనుకోకుండా అచ్చట ప్రత్యక్షమయిన కౌసల్యను చూచి అంతా ఆశ్చర్య చకితులయ్యారు.

ఆండాళును లోపలకి తీసుకొని వెళ్తున్న కౌసల్యను చూచి,

"ఎవర్రా ఆ అమ్మాయి!" రామారావు అడిగాడు.

"మా మామయ్య కూతురు... కౌసల్య..."

"ఉయ్యాల్లో పిల్లను పెట్టుకొని, పిల్లకోసం వూరంతా తిరిగిందట ఒక ఇల్లాలు. ఇంత చక్కని చందనపు బొమ్మ వుండగా, మీ అమ్మ మరొక సంబంధం ఎందుకు చూడవలసి వచ్చింది?"

"మా అమ్మ నాకోసం మంచిపని చేస్తుంది."

"అయితే మీ మామయ్యకు ఈ సంబంధం ఇష్టం లేదా?"

"అనవసరంగా ఆశలు కల్పించుకొని అడియాశ పడడంకంటే, అందని ఆశలను అంతంచేయడం మంచిది. భోజనం టైము అయిందిలే!" రామారావుని తీసుకొని మధ్య సావిట్లోనికి వచ్చేసరికి కౌసల్య మాటలు విన్పించాయి. వెంకట్రావు కన్పించకుండా అచ్చట నిలబడి శ్రద్ధగా వింటున్నాడు.

"బావకు గుంటూరులో సంబంధం కుదిరిందని విన్నాను. నిజమేనా వదినా!" ఆండాళ్ ని అడిగింది కౌసల్య.

ఆండాళ్ మాట్లాడకుండా కూర్చుండి పోయింది.

"ఒకవేళ నిజమయితే అది జరగడానికి వీల్లేదు." బాధతో అంటున్న ఆమె మాటలువిని, నిర్విణ్ణురాలై చూచింది ఆండాళు.

"సంబంధం ఇంకా నిశ్చయం కాలేదు. డిప్యూటి కలక్టరుగారి అమ్మాయి... పేరు కుసుమ, చామన ఛాయ, సన్నగావున్నా, చురుగ్గా పనులు చేస్తుంది. సంప్రదాయ కుటుంబం. నల్గురితో మంచి గౌరవ మర్యాదలున్నవారు......"

"చాలు వదినా...అయితే ఆ సంబంధానికి బావ ఇష్టపడ్డాడా?" గొంతులో జారుముడిపడింది.

"ఆ విషయం నాకు తెలీదు. వాళ్ళు ఫ్రెండుకి చెప్పి ఉంటారు."

"వడ్డన చేస్తాను." అంటూ నరసమ్మ వచ్చి, ఉత్సాహమైన సంభాషణను వింటున్న వెంకట్రావుని నిరుత్సాహ పరచింది.

అంతా, భోజనాలకు లేచారు.

ఆ రోజంతా ఉండి రామారావు ఆండాళ్ వాళ్ళ ఊరు వెళ్ళిపోయారు.

♦ ♦ ♦

మూడు సంవత్సరాల-అనంతరం.

"ఏమండీ! ఇప్పటికైనా కౌసల్య హృదయాన్ని అర్థం చేసుకొన గల్గారా!" నిద్రపోతున్న వెంకట్రావును లేపి అడిగింది కుసుమ.

"అర్థమయింది. అదిప్పుడు లక్షాధికారి భార్య... ఇద్దరు ఆడ పిల్లల తల్లి." కళ్లు తెరచి, మంచంమీద లేచి కూర్చున్న వెంకట్రావు చిన్న నయనాలలోనికి తొంగి చూచింది కుసుమ.

బాధను వ్యక్తపరుస్తుంది అతని అంతర్యం; గాథను చిత్రించుకుంటుంది ఆమె అంతరాత్మ.



అన్ని మందుల షాపులలోను లభించును